సాక్షి సంగారెడ్డి


మంగళవారం । 18 । మార్చి । 2025



తీపి తగ్గలేదు...
జహీరాబాద్ నియోజకవర్గంలో చాలామంది రైతులు చెరుకుసాగుపై ఆసక్తి చూపుతున్నారు.
వివరాలు 8లో ▸



చలువ పందిళ్లే మొక్కలకు రక్ష
నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.
వివరాలు 9లో ▸



న్యూస్‌రీల్

పీఆర్‌టీయూ అధ్యక్షుడు లక్ష్మణ్‌కు సన్మానం



పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డి ఉన్నత పాఠశాలలో పీజీ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన గుండు లక్ష్మణ్‌ను తోటి ఉపాధ్యాయులు, యువజన సంఘం సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు రాంమోహన్‌రావు, వంశీకృష్ణ, హెచ్‌ఎంలు శైలజ కులకర్ణి, దేవిసింగ్, సంగయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి రేణుక ఎల్లమ్మ జాతర



ఆలయంలోని అమ్మవారు

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని కుప్పానగర్ గ్రామ దేవతగా కొలువుదీరిన శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన పూర్తి ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, సాయంత్రం బోనాల ఊరేగింపు, రాత్రికి ఎల్లమ్మ జీవిత చరిత్ర నాటకం ప్రదర్శించనున్నారు. అమ్మవారి జీవిత చరిత్ర నాటకాన్ని మూడు విభాగాలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి భాగం మంగళవారం, రెండవ భాగం గురువారం నిత్య పూజలు, ఎడ్ల బండ్ల ఊరేగింపు, ఎల్లమ్మ జీవిత చరిత్ర నాటకం ఉంటుందన్నారు. మూడవ భాగం శనివారం ప్రదర్శిస్తున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

ఐఐటీహెచ్‌కు జర్మన్ వర్సిటీల బృందం



జర్మనీ యూనివర్సిటీల వీసీలతో ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జర్మనీలోని 20 ప్రముఖ యూనివర్సిటీల వైస్‌చాన్సలర్లు, రెక్టార్ల బృందం సోమవారం సంగారెడ్డి జిల్లా కంది‌లోని హైదరాబాద్ ఐఐటీని సందర్శించింది. పరిశోధ, విద్యా పరంగా సహాయ సహకారాలను విస్తరించే కార్యక్రమంలో భాగంగా ఈ బృందం ఐఐటీహెచ్‌కు వచ్చినట్లు ఆ సంస్థ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి. జర్మనీకి చెందిన ఆయా యూనివర్సిటీలు ఐఐటీహెచ్‌లకు పరస్పర ఆసక్తి నెలకొన్న రంగాలపై పరిశోధనలకు సహకారం, స్టూడెంట్, అధ్యాపకుల పరస్పర మార్పిడి, డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం, ఉమ్మడి వర్క్‌షాప్‌లు, వర్చువల్ బ్రెయిన్ స్టార్మింగ్ సెషన్లు తదితర అంశాల్లో ఆయా యూనివర్సిటీలు ఐఐటీహెచ్‌తో కలిసి ముందుకు వెళ్లనున్నాయి. ఈ బృందానికి ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి స్వాగతం పలికారు. కార్యక్రమంలో అంతర్జాతీయ సంబంధాల విభాగం డీన్ ప్రొఫెసర్ తరుణ్‌పాండ, పరిపాలన డీన్ ప్రొఫెసర్ ప్రేమ్‌పాల్, డాక్టర్ మయూర్ తదితరులు పాల్గొన్నారు.

గీతం స్కాలర్ శ్రీనివాస్‌కు డాక్టరేట్

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని గణిత విభాగం పరిశోధక విద్యార్థి శ్రీనివాస్ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. బీజ గణిత విధానంలో వైబ్రేషనల్ హామిల్టోనియన్ ఉపయోగించి పాలిటామిక్ అణువుల వైబ్రేషనల్ ఫ్రీక్వెన్సీలను అధ్యయనం చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ మేరకు ఈ పరిశోధనకు గైడ్‌గా వ్యవహరించిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ శేఖర్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. డాక్టర్ శ్రీనివాస్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు హర్షం వ్యక్తం చేశారు.



ఆటోవాలాగా మారి...

ఇతడి పేరు ఏరు రమేశ్. తాతల కాలం నుంచి తండ్రి నర్సింహులు వరకు నేతపనులు చేసేవారు. తల్లిదండ్రుల సహకారంతో తానూ వస్త్రాలు నేసేవాడు. చేతినిండా పని, జేబు నిండా డబ్బులు. దర్జా బతుకు. ఇంతలోనే తలరాత మారింది. చేనేతరంగం తిరోగమించడంతో మెతుకు కరువై బతుకు భారమైంది. ఇంటర్ వరకు చదువుకున్న రమేశ్ పై చదువులకు వెళ్లలేక, చేసేందుకు పనులు లేక నారాయణఖేడ్‌కు తల్లిదండ్రులు, భార్య, ముగ్గురు పిల్లలతో వలస వచ్చేశాడు. ఇక్కడ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

వస్త్ర దుకాణంలో కూలీగా...

ఇతడి పేరు సోమ విఠల్. తండ్రి నాగభూషణం చేనేత వస్త్రాలు నేసేవాడు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చేనేత కార్మికులు, యువకులకు గ్రామంలో ఆరునెలలపాటు చేనేత పనిలో శిక్షణ ఇచ్చారు. విఠల్ కూడా పని నేర్చుకుని కొన్నాళ్లపాటు చేనేత వస్త్రాలు తయారు చేశాడు. క్రమేణా వాటికి డిమాండ్ పడిపోవడంతో ఆ రంగం పూర్తిగా కుదలైంది. చేసేదిలేక ఇప్పుడు ఓ వస్త్ర దుకాణంలో కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.



సిరుల దారం.. నిరాధారం

నారాయణఖేడ్ పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉంది హన్మంత్‌రావుపేట్. ఒకప్పుడు మగ్గం చప్పుళ్లతోనే నిద్రలేచేది.. మెజార్టీ జనాలకు చేతి నిండా పని.. జేబు నిండుగా డబ్బులు. ఉమ్మడి కుటుంబాలు, భారీ భవంతులతో నివాసాలు.. ఊరంతా లక్ష్మీకళతో ఉట్టిపడేది.. వ్యవసాయానికి పెట్టుబడులు.. పండుగలు వస్తే చుట్టుపక్క గ్రామాల వారు వీరి దగ్గరకు వచ్చి డబ్బులు అప్పుగా తీసుకెళ్లేవారు. ఏ కార్యమైనా ఈ ఊరే ఆదుకునేది. 30 ఏళ్ల నాటిదీ వైభవం.. కాలం గిర్రున తిరిగింది. అన్ని రోజులు మనవి కావన్నట్లు .. అప్పటి నుంచి పతనం ప్రారంభమైంది. ఆదుకున్న ఊరు చేయిచాచే స్థితికి పడిపోయింది. ఏదైనా పని ఇప్పించండంటూ.. చిన్నపాటి పని దొరికినా ఇంటిల్లిపాదీ బతుకీడ్చాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. పొట్ట చేతపట్టుకుని తలోదిక్కుకు వలస వెళ్లిపోయారు. ఊరు ఆగమైంది. ఇళ్లు పడావు పడ్డాయి. మొత్తంగా ఆ ఊరే కళ తప్పింది.

–కె.వెంకటేశ్వర్లు, నారాయణఖేడ్

చేనేత పనులతో కళకళలాడిన హన్మంత్‌రావుపేట్ గ్రామం

- పనుల్లేక నేడు విహీనమై..
- నాడు ఆదుకున్న చేతులే నేడు ఉపాధిని అర్థిస్తున్న వైనం
- కుటుంబాల వలసలతో పడావు పడిన ఇళ్లు

సాక్షి పరిశీలన

ఊరంతా నేతన్నలే..

చేనేత కళాకారులకు పెట్టిందిపేరు హన్మంత్‌రావుపేట్. గ్రామంలో 524 నివాసాలు.. 80శాతంపైగా అంటే 405 నివాసాలు చేనేత కార్మికులు (పద్మశాలీలు). మెజార్టీ జనాభా చేనేత కార్మికులు..గ్రామంలో పద్మశాలీలలో గోస్కె ప్రకాశంకు, గోస్కె నాగభూషణం, గోస్కె మాణిక్యంలకు నాలుగెకరాల చొప్పున వ్యవసాయ భూమి. మిగతా నేత కార్మికులందరూ వ్యవసాయ భూములు లేక నేత పనిపైనే జీవనం. ఇతర కులస్తులకు కొంతమేర భూములున్నాయి. వారు వ్యవసాయం, ఇతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

సన్నటి వస్త్రం... కొత్త డిజైన్లు..

నాణ్యమైన సన్నటి దారంతో కొత్త కొత్త డిజైన్లతో వస్త్రం నేయడంతో హన్మంత్‌రావుపేట్ వస్త్రాలకు నాడు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండేది. సంజీవన్‌రావుపేట్, తుర్కాపల్లి, నమ్లిమేట్ తదితర ప్రాంత దొరలు, దేశ్‌ముఖ్‌లు, పటేళ్లు, పట్వారీలు వీరునేసిన వస్త్రాలనే కొనుగోలు చేసేవారు. వీరు నేసిన వస్త్రాలను హైదరాబాద్ ప్రాంతంలో ఉన్న వారి బంధువులు, మిత్రులకు కొనుగోలు చేసి పంపించేవారు. ఇతర ప్రాంతాల్లో నేసే వస్త్రాలకు దొడ్డురకం దారం వాడేవారు. హైదరాబాద్ ప్రాంతంలో హన్మంత్‌రావుపేట్ వస్త్రాలకు పేరు రావడంతో ఏ ప్రాంతం వారైనా తమ గ్రామం పేరు చెబితే ఆ సంతల్లో వస్త్రాల విక్రయాలు జోరుగా సాగేవి.



హన్మంత్‌రావుపేట్ గ్రామం వ్యూ

- ఆదుకున్న ఊరు ఆగమైంది

వారం, వారం కొత్తపైస..

మెషినరీ వస్త్రాలు ప్రవేశించకముందు...ఈ గ్రామం నేతపనులతో కళకళలాడేది. ఈ గ్రామం చేనేత వస్త్రాలకు పెట్టింది పేరు. చుట్టు ప్రక్కల ప్రాంతాల వారు ఇక్కడికే వచ్చి కొనుగోలు చేసే వారు. సికింద్రాబాద్ నుంచి నూలు తీసుకొచ్చి వస్త్రాలు నేసి నిజామాబాద్, కామారెడ్డి, బోధన్, జడ్చర్ల, భైంసా, ముథోల్, మహబూబ్‌నగర్ ప్రాంతాల వరకు సరఫరా చేసేవారు. వీరు వస్త్రం నేసినా, సంతకెళ్లి అమ్మినా చేతినిండా డబ్బులే. నిత్యం 'కొత్త పైస'(నాడు వ్యవసాయదారులు ఆరు నెలలకు పంట అమ్మితేనే డబ్బులు (కొత్తపైస) చూసేవారు). వస్త్రాల అమ్మకం ద్వారా వారం వారం డబ్బులు రావడంతో వీరి వద్దనే భారీగా డబ్బు జమయ్యేది.

ఆదుకున్న నేతన్నలు ఆగమయ్యిండ్రు..

ఉదయం 4గంటలకే నిద్రలేచి మగ్గాల పనులు ప్రారంభించి రాత్రి 9గంటల వరకు కందీల (లాంతర్) పెట్టుకుని మరీ పనులు పూర్తి చేసేవారు. చుట్టుపక్కల రైతులు, కూలీలు, ఇతర పనులు చేసుకునే వారు వీరి వద్దకు వచ్చేవారు. పంట పెట్టుబడులు, పండగలు, శుభ, అశుభ కార్యాలకు వీరి వద్దనే డబ్బులు తీసుకెళ్లేవారు. అంతే నమ్మకంతో పంట అమ్మినాక తెచ్చి ఇచ్చేవారు. చాలా గ్రామాల మోతుబరి రైతులు కూడా వీరి వద్ద నుంచి అప్పులు తీసుకునేవారు.

ఆప్కోలకూ వీరే వస్త్రాల సరఫరా...

ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ఆప్కోలకు సైతం వీరే వస్త్రాలు సరఫరా చేసేవారు. అయితే మెషినరీ వస్త్రాల వేగంతో నేత పనిపై తీవ్ర ప్రభావం పడింది. అదేసమయంలో ఆప్కోలూ మూతపడ్డాయి. పను లు తగ్గడంతో నేత కార్మికుల పరిస్థితి దుర్భరమైంది. వ్యవసాయ భూములు లేకపోవడం, నేత పనులు సాగకపోవడంతో పొట్టపోసుకునేందుకు వలస మార్గాన్ని ఎంచుకున్నారు. మహారాష్ట్రలోని షోలాపూర్, ఇచ్చల్ కరంజి, సిరిసిల్ల, కోయిలగూడెం, కార్వాన్, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లి ఆయా వ్యాపార సంస్థల్లో కార్మికులుగా, భవన నిర్మాణ కూలీలుగా, ఆటో డ్రైవర్లుగా పనులు చేసుకుంటున్నారు. మెజార్టీ పద్మశాలీలు వలసవెళ్లిపోయారు. ఇళ్లను వదిలి వేయడంతో దుమ్ముకొట్టుకుపోయి దర్శనమిస్తున్నాయి. కొన్ని శిథిలమై పాడుపడ్డాయి. అక్కడక్కడా ఉన్న వృద్ధులు అతికష్టంమీద జీవనం సాగిస్తున్నారు. కొందరు బీడీలు చుడుతున్నారు.

నాటి వైభవం చూడలేం..



నా వయస్సు 75 ఏళ్లు. నా భార్య గోస్కె నాగమణి. వయస్సు 65. ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. హైదరాబాద్‌లో ఓ కుమారుడు టైలర్ పని చేస్తున్నాడు. మరో కుమారుడు ఏజెన్సీలో పని చేస్తున్నాడు. అప్పుడు చేతినిండా డబ్బులుండేవి. మా వద్దకు వచ్చి చాలామంది అప్పులు కూడా తీసుకునేవారు. నేత పనులతో ఊరు కళకళలాడేది. మెషినరీ మగ్గాలు రావడంతో చేతిలో పనుల్లేకుండా పోయాయి. మళ్లీ నాటి వైభవం చూడలేం.

– గోస్కె మాణిక్యం, హన్మంత్‌రావుపేట్



బీడీలు చుడుతున్న గోస్కె మాణిక్యం దంపతులు



మూలపడి దుమ్ముపట్టిన మగ్గాలు



కూలిన నివాసం

సింగూరు ఎడమ కాలువకు నీళ్లివ్వాలి

- త్వరలో చలో సింగూరు కార్యక్రమం
- అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

జోగిపేట(అందోల్): సింగూరు ఎడమ కాలువకు వెంటనే నీళ్లను విడుదల చేయాలని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ డిమాండ్ చేశారు. ఆందోల్ నియోజకవర్గంలోని పుల్కల్ మండలం లక్ష్మిసాగర్‌లో గల పలు గ్రామాల్లో ఎండిపోయిన వరి, జొన్న చేలను సోమవారం స్థానిక రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రభుత్వం సింగూరు నీళ్లను సేద్యానికి వదలకపోతే రైతుల అందరితో కలిసి మేమే వదులుకుంటామని హెచ్చరించారు. వర్షాకాలంతోపాటు యాసంగికి కూడా కాలువ నీళ్లు వదలకపోవడం, చెరువులో నీళ్లు నింపక పోవడం వల్ల వేలాది ఎకరాల వరి పంట ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు అందకపోవడం వల్ల చేతికి వచ్చిన పంట ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. పదేళ్లలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులను రైతులు ఎదుర్కొనలేదని చెప్పారు. కాలువ మరమ్మతుల పేరుతో ఏడు నెలలుగా నీళ్ల వదలడంలేదన్నారు. రైతులకు ముందే ఈ పరిస్థితిని తెలియజేస్తే వరి పంటలు వేసుకోకుండా ప్రత్యామ్నాయంగా వేరే పంటలు వేసుకునే వారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి రాజనర్సింహ ఆలోచించి ఎసింగూరు కాలువ నీటిని విడుదల చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సింగూరు ప్రాజెక్టులో 22 టీఎంసీల నీళ్ల నిల్వ ఉన్నప్పటికీ వాటిని వినియోగించుకోలేని దుస్థితి ఉందన్నారు. కాలువ ద్వారా నీటి విడుదల కోసం త్వరలో 'ఛలో సింగూరు'కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, పుల్కల్ మండల పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆయన వెంట ఉన్నారు.



లక్ష్మిసాగర్ తాండాలో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

గ్రామాల్లో నీటి నాణ్యతను పరీక్షించాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: ప్రతీ గ్రామంలో నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజలకు శుద్ధమైన తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. గ్రామస్థాయిలో చేతి పంపులు, మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని పర్యవేక్షించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని అధికారులు నిరంతరం పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పంచాయతీ రాజ్ అధికారులు, మున్సిపల్ అధికారులు, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి సమస్య ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌ఓ పద్మజారాణి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఆర్డీఓలు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

కలెక్టర్‌ను కలిసిన పాలిటెక్నిక్ విద్యార్థులు

సీఎస్ఆర్ నిధులతో సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సీసీ రోడ్డు నిర్మాణం, తాగునీటి సౌకర్యానికి ఆర్వోప్లాంట్ నిర్వహణ, అభివృద్ధికి నిధులు మంజూరు చేయటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

వెనుకబడిన విద్యార్థులూ రాణించేలా ఏఐ

విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి

పటాన్‌చెరు టౌన్: చదువులో వెనుకబడిన విద్యార్థులు కూడా కృత్రిమ మేథ ద్వారా రాణించేలా ఏఐను ఇంకా మెరుగుపరిచే అంశాలను పరిశీలిస్తున్నామని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి ముత్తంగి జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలను సోమవారం పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఏఐ ల్యాబ్ విద్యార్థులకు ఏ విధంగా ఉపయోగపడుతుందో స్వయంగా చూసి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు దీనిపై ఎంత అవగాహన ఉందో అని అడిగి తెలుసుకున్నారు. దీనిపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామన్నారు.



ఏఐ ల్యాబ్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి

ఆన్‌లైన్ బెట్టింగ్స్‌పై అవగాహన కల్పించాలి

ఎస్పీ పరితోష్ పంకజ్

పటాన్‌చెరు టౌన్: బెట్టింగ్ ఆప్స్, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌ను సోమవారం రాత్రి తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్ ఆవరణ, సిబ్బంది బ్యారెక్ పరిశుభ్రతను, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. సైబర్ నేరాలలో విద్యావంతులే అధికం ఉంటున్నారని తెలిపారు. అధికారు సిబ్బంది హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో స్పష్టం చేశారు.

ఖేడ్ మున్సిపల్‌కు 70.20లక్షల తైబజార్ ఆదాయం

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీకి 2025–26 ఆర్థిక ఏడాదికి గాను తైబజార్ వేలం పాట ద్వారా రూ.70.20లక్షల ఆదాయం వచ్చినట్లు కమిషనర్ జగజ్జీవన్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో తైబజార్, మేకల బజార్, పెద్దమాంసం, ఎడ్లబజార్, చిన్న మాంసంకు సంబంధించి వేలం పాటలు నిర్వహించారు. తైబజార్‌కు రూ.42.05లక్షలకు గులెన్‌గారి రాములు, మేకల బజార్‌ను రూ.21.85 లక్షలకు గడీల నర్సింహులు, ఎడ్ల బజార్‌కు రూ.3.65 లక్షలకు, పెద్ద మాంసం 1.90 లక్షలకు, చిన్నమాంసం రూ.75 వేలకు యాదుల్ ఖురేషి దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఆస్తిపన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్

నాలుగు దుకాణాల సీజ్

జహీరాబాద్ టౌన్: ఆర్థిక ఏడాది మరో 13 రోజుల్లో ముగుస్తుండటంతో జహీరాబాద్ మున్సిపల్ అధికారులు మొండి బకాయిల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పోలీసుల సహకారంతో మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వర్‌రావు సోమవారం మొండి బకాయిదారులకు సంబంధించిన నాలుగు దుకాణాలను సీజ్ చేసి తాళం వేశారు. ప్రతీ ఏటా ఇళ్లు, వ్యాపార సంస్థలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఆస్తి పన్ను వసూళ్లు సుమారు రూ.7 కోట్ల వరకు వస్తుంటుంది. ఈ మేరకు పన్ను వసూళ్లు కాకపోవడంతో మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారికి లక్ష్యాలను నిర్దేశించారు. ప్రచార వాహనాన్ని ఏర్పాటు చేసి ప్రతీరోజు పట్టణంలో తిప్పుతున్నారు.



దుకాణానికి తాళం వేసి సీజ్ చేస్తున్న కమిషనర్ ఉమామహేశ్వర్‌రావు

17లక్షల క్వింటాళ్ల చక్కెర ఉత్పత్తి

- లక్ష్యం 16.81లక్షల టన్నులు.. క్రషింగ్ 15.99లక్షలు టన్నులు
- చక్కెర కర్మాగారాల్లో ముగిసిన క్రషింగ్

జహీరాబాద్: రాష్ట్రంలోని ఏడు చక్కెర కర్మాగారాల్లో 2024–25 క్రషింగ్ సీజన్‌కుగాను చెరుకు క్రషింగ్‌ను ముగించాయి. క్రషింగ్ లక్ష్యం 16.81లక్షల టన్నులు కాగా, 15.99లక్షల టన్నుల మేర చెరుకును గానుగాడించాయి. గతేడాదికంటే ఈ ఏడాది 51వేల టన్నుల తక్కువ చెరుకు క్రషింగ్ జరిగింది. సంగారెడ్డిలోని గణపతి కర్మాగారం 4,29,986 టన్నుల మేర చెరుకును క్రషింగ్ నిర్వహించింది. రాయికోడ్‌లోని గోదావరి- గంగా కర్మాగారం 1,15,504, కామారెడ్డిలోని గాయత్రి 3,17,648, నిజాంసాగర్‌లోని గాయత్రి కర్మాగారం 3,65,279, కాకతీయ షుగర్స్ కర్మాగారం 47,887, మధుకాన్ కర్మాగారం 57,989, క్రిష్ణవేణి కర్మాగారం 2,65,152 టన్నుల మేర చెరుకును క్రషింగ్ నిర్వహించాయి.



క్రషింగ్ కోసం తరలివచ్చిన చెరుకు పంట(ఫైల్)

గోదావరి–గంగా 1,20,150 క్వింటాళ్లు

రాష్ట్రంలోని ఏడు చక్కెర కర్మాగారాలు ఈ క్రషింగ్ సీజన్‌లో 17,00,325 క్వింటాళ్ల చక్కెరను ఉత్పత్తి చేశాయి. గణపతి చక్కెర కర్మాగారం 4,74,250 క్వింటాళ్లు, గోదావరి గంగా కర్మాగారం 1,20,150, కామారెడ్డిలోని గాయత్రి షుగర్స్ 3,44,790, నిజాంసాగర్‌లోని గాయత్రి కర్మాగారం 3,65,279, కాకతీయ షుగర్స్ 41,860, మధుకాన్ షుగర్స్ 52,730, క్రిష్ణవేణి షుగర్స్ కర్మాగారం 2,74,150 క్వింటాళ్ల మేర చక్కెరను ఉత్పత్తి చేసినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. రాయికోడ్‌లోని గోదావరి గంగా కర్మాగారం రైతులకు మొత్తం చెరుకు బిల్లులను చెల్లించింది. సంగారెడ్డిలోని గణపతి కర్మాగారం రూ.158.32 కోట్లకు గాను రూ.144.50 కోట్ల మేర బిల్లులను చెల్లించినట్లు అధికార వర్గాలు వివరించాయి.

క్లుప్తంగా

అగ్నివీర్ నియామకాలకు దరఖాస్తు చేసుకోవాలి

డీఐఈఓ రవీందర్‌రెడ్డి

సిద్దిపేట ఎడ్యుకేషన్: అగ్నివీర్ నియామకాలకు జిల్లాలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) రవీందర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ..రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, ఏప్రిల్ 10 వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. జనరల్, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్, ట్రేడ్‌మెన్ తదితర విభాగాల్లో నియామకాలు ఉంటాయన్నారు. జనరల్ విభాగానికి 10వ తరగతి 45 శాతం మార్కులతో, టెక్నికల్‌కు ఇంటర్ ఎంపీసీ 50 శాతం మార్కులతో, క్లర్క్ విభాగానికి ఇంటర్మీడియట్ 60 శాతం మార్కులతో, ట్రేడ్‌మెన్‌కు 10వ తరగతి 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. 17.5 ఏళ్ల నుంచి 21 ఏళ్ల మధ్య ఉండి అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని వివరించారు. నియామక ప్రక్రియ రెండు దశల్లో ఉంటుందని మొదటిది 200ల మార్కులకు కామన్ ఎంట్రెన్స్ పరీక్ష, రెండవ దశలో రన్నింగ్, శారీరక దృఢత్వ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. రూ.250 పరీక్ష రుసుం చెల్లించి సంబంధిత అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పరీక్ష జూన్ నెలలో ఉంటుందన్నారు. నియామకాలు పూర్తిగా మెరిట్‌పైనే ఆధారపడి ఉంటాయన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌ల జోలికి వెళ్లొద్దు

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్లకూడదని, గేమింగ్‌కి అలవాటు పడి యువత ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. బెట్టింగ్‌లపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సోషల్ మీడియా వేదికగా ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్స్‌లను ప్రమోట్ చేసే వారి సమాచారం అందించాలన్నారు. మోసపూరిత ప్రకటనలు, మెసేజ్‌లకు వ్యక్తిగత, ఓటీపీ వివరాలు పంపకూడదన్నారు. ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు తెలపాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం రెవెన్యూ, పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఆర్ఐ యాదగిరి కథనం మేరకు.. నమ్మదగిన సమాచారం మేరకు చిగురుమామిడి మండలం కొండాపూర్‌కు చెందిన బత్తుల అంకుష్ వద్ద దాదాపు 7 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నాం. గ్రామంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి ఓ ప్రైవేట్ ఇంట్లో నిల్వ ఉంచారు. రేషన్ బియ్యాన్ని పట్టుకొని సివిల్ సప్లయ్ గోదాముకు తరలించాం. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్ భాస్కర్ తెలిపారు.

హత్య కేసులో నిందితురాలి అరెస్ట్

సంగారెడ్డి క్రైమ్ : యువకుడి హత్య కేసులో నిందితురాలైన గడ్డం మరియమ్మను పోలీసుల ఆదివారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రమేశ్ కథనం మేరకు.. 15న మన్నే వినోద్ (21) అనే యువకుడితో డబ్బుల విషయంలో గొడవ జరుగగా ఆగ్రహించిన మరియమ్మ రాయితో కొట్టి దారుణంగా హత్య చేసింది. ఈ కేసు భాగంగా నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఇసుక ఫిల్టర్‌పై పోలీసుల దాడి

కృత్రిమ ఇసుక తయారీ యంత్రాలు సీజ్

నిర్వాహకుడిపై కేసు నమోదు

తూప్రాన్: మట్టితో కృత్రిమ ఇసుక తయారీ చేస్తున్న ఇసుక ఫిల్టర్‌పై పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. మండలంలోని గొడిగుడెం శివారులో విష్ణువర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి అక్రమంగా తవ్వకాలు జరిపి కృత్రిమ ఇసుక తయారు చేసి వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి జేసీబీ, హిటాచీ, ఇసుకతో కూడిన రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తీపి తగ్గ లేదు..

- చెరకు సాగుపై రైతులకు పెరుగుతున్న ఆసక్తి
- జహీరాబాద్ నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్లాంటేషన్
- ఇప్పటి వరకు 3.50 లక్షల టన్నులు
- కొత్త కర్మాగారం ఏర్పాటు, ఫ్రీ జోన్ ప్రకటన
- పంట సరఫరాకు తొలగిన అడ్డంకులు



జహీరాబాద్ ప్రాంతంలో కొత్తగా ప్లాంటేషన్ చేసిన చెరకు పంట

న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ గ్రామ రైతు ఈదుల్‌పల్లి నాగన్న గతేడాది 4 ఎకరాల్లో చెరకు పంట పండించాడు. ఈసారి మరో రెండు ఎకరాలు అదనంగా ప్లాంటేషన్ చేశాడు. ప్రస్తుతం 6 ఎకరాల్లో చెరకు తోట ఉంది. అదే గ్రామానికి చెందిన రవీందర్‌కు రెండు ఎకరాల చెరకు పంట ఉండగా ఈ ఏడాది మరో ఎకరంలో వేశాడు. ఇలా జహీరాబాద్ నియోజకవర్గంలోని చాలా మంది రైతులు చెరకు పంటపై ఆసక్తి చూపుతున్నారు. చెరకు వల్ల పెద్దగా నష్టం రాదన్న నమ్మకంతో అధిక శాతం మంది రైతులు సాగు చేస్తున్నారు.

– జహీరాబాద్ టౌన్

జహీరాబాద్ ప్రాంత నేలలు చెరకు, అల్లం, ఆలుతో పాటు కంది, సోయాబీన్,పత్తి, పెసర, మొక్కజొన్న,శనగ పంటలకు అనుకూలం. నీటి వనరులు లేనందున బోరుబావులపై ఆధారపడి పంటలను పండిస్తుంటారు. ముఖ్యంగా రైతులు చెరకు సాగు వైపు మొగ్గు చూపుతారు. ఎకరం పొలం కలిగిన రైతు కూడా బోరు వేసుకొని చెరకు పండిస్తుంటారు. స్థానికంగా ట్రైడెంట్ చక్కెర కర్మాగారం ఉండటంతో చెరకు పంటను వేస్తున్నారు. పలు కారణాలతో రెండేళ్ల నుంచి ట్రై డెంట్ కర్మాగారంలో క్రషింగ్ నిలిచిపోవడంతో రైతులు కొంత ఆందోళన చెందారు. పంటను ఎక్కడికి సరఫరా చేయాలన్న భయం వారిలో నెలకొంది. జిల్లా షుగర్‌కేన్ అధికారులు రంగప్రవేశం చేసి ట్రైడెంట్ జోన్‌ను ఫ్రీజోన్‌గా ప్రకటించారు. ఇక్కడ పండించిన పంటను ఎక్కడికైనా అమ్ముకోవచ్చని చెప్పారు. అదే సమయంలో రాయికోడ్ మండలంలో కొత్తగా కర్మాగారం ఏర్పాటు కావడంతో ఊరట లభించింది. 2024–25 సీజన్‌లో కర్మాగారంలో క్రషింగ్ విజయవంతం పూర్తి చేయడంతో రైతుల్లో ఆత్మస్థైర్యం పెరిగింది.

సుమారు 10 వేల మంది రైతులు

జహీరాబాద్ ప్రాంతంలో సుమారు 10 వేల మంది రైతులు దాదాపు 20 వేల ఎకరాల్లో ప్రతీ సంవత్సరం చెరకు పంటను సాగు చేస్తుంటారు. సుమారు 5 లక్షల టన్నుల వరకు చెరకు పంట పండిస్తుంటారు. ట్రైడెంట్‌లో క్రషింగ్ జరగనందున గతేడాది సుమారు 3 లక్షల టన్నులకు పడిపోయింది. జహీరాబాద్‌ను ఫ్రీజోన్‌గా ప్రకటించడంతో పంట మొత్తం ఇతర మిల్లులకు తరలించడంతో పొలాలన్నీ ఖాళీ అయ్యాయి. రైతులకు భరోసా కల్గడంతో ఈ సంవత్సరం పంట విస్తీర్ణం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.ప్లాంటేషన్ చేసినట్లు తెలిసింది. జూన్ నెలాఖరు వరకు ప్లాంటేషన్ కొనసాగుతుందని, సాగు విస్తీర్ణం పెరుగనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

చెరకు నష్టం కల్గించదు



చెరకు పంట ద్వారా లాభం తగ్గిన నష్టం మాత్రం రాదు. అందుకని వర్షాలు పడ్డా పడకపోయినా.. గిట్టుబాటు ధర ఉన్నా లేకపోయినా ప్రతీ సంవత్సరం పంట వేస్తాం. గతేడాది నాలుగు ఎకరాల్లో పంట వేశాను. పెట్టుబడులు పోగా లాభం వచ్చింది. ట్రైడెంట్‌లో క్రషింగ్ ఆడకపోయినా బ్రోకర్లు పంటను కొని టన్నుకు రూ. 2,600 వేలు ఇచ్చారు. అందుకని ఈ సంవత్సరం అదనంగా రెండు ఎకరాల్లో చెరకు ప్లాంటేషన్ చేశా.

–వీరన్న పాటిల్, రైతు దిడ్గి, జహీరాబాద్

కర్నాటక, మహారాష్ట్రలోని మిల్లులకు తరలింపు

రెండేళ్ల నుంచి స్థానిక ట్రైడెంట్ కర్మాగారం బంద్ ఉండటంతో పంట సరఫరా కోసం రైతులు నానా అవస్థలు పడ్డారు. 2024–25 సీజన్‌లో రాయికోడ్ మండలంలోని మాటూర్ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన గోదావరి–గంగా కర్మాగారంలో పూర్తి స్థాయిలో క్రషింగ్ జరిగింది. గోదావరి–గంగాతో పాటు పొరుగున ఉన్న సంగారెడ్డి గణేశ్ షుగర్స్, కామారెడ్డి గాయత్రీ, కొత్తకోట కృష్ణవేణితో పాటు పక్కనున్న కర్నాటక, మహారాష్ట్రలోని మిల్లులకు రైతులు పంటను తరలించారు. పొలాల్లోని పంట మొత్తం ఖాళీ అవడంతో కొత్తగా ప్లాంటేషన్‌పై ఆసక్తి చూపుతున్నారు.

కేసుకు కారకుడయ్యాడని చంపేశారు

- వీడిన యువకుడి హత్య కేసు మిస్టరీ
- ముగ్గురు నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్ రెడ్డి

పాపన్నపేట(మెదక్): డ్రంకెన్ డ్రైవ్ కేసుకు కారకుడయ్యాడన్న కోపంతో తోటి మిత్రులే యువకుడిని కొట్టి హత్య చేశారని మెదక్ రూరల్ సీఐ జీ.రాజశేఖర్ రెడ్డి, పాపన్నపేట ఎస్సై సార శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. 10న ఏడుపాయల వద్ద వెలుగు చూసిన హత్యకేసును పోలీసులు ఛేదించి సోమవారం వివరాలు వెల్లడించారు. పాపన్నపేట మండలం రామతీర్థం గ్రామానికి చెందిన వడ్ల నవీన్ సంగారెడ్డిలోని ఓ బేవరేజ్ కంపెనీలో పని చేసే సమయంలో తొగర్‌పల్లికి చెందిన వినోద్ రెడ్డి, సంగారెడ్డికి చెందిన బేగరి రాములు, కుమ్మరి రమణాచారి స్నేహితులయ్యారు. సంగారెడ్డిలో గత నెల 18న నలుగురు స్నేహితులు మద్యం సేవించి వెళ్తూ పోలీసుల డ్రంకెన్ డ్రైవ్ టెస్టులో దొరికారు. నవీన్ పోలీసులను బతిమాలుతుండగా, వినోద్ రెడ్డి వారితో దురుసుగా ప్రవర్తించారు. దీంతో పోలీసు లు కేసు నమోదు చేశారు. కోర్టు జరిమానా, ఇతర ఖర్చులను నవీన్ భరించాడు. అప్పటి నుంచి వినోద్ రెడ్డిపై మిత్రులు కక్ష పెంచుకున్నారు. ముందస్తు ప్లాన్ ప్రకారం ఈనెల 8న ముగ్గురూ కలిసి వినోద్ రెడ్డిని తీసుకొని ఏడుపాయల్లో దావత్ చేసుకుందామని తీసుకెళ్లారు. ఏడుపాయల్లో మందు కొనుగోలు చేసి మునిపట్ట వద్ద తాగారు. అప్పటికే కోపంతో ఉన్న నవీన్ కట్టెతో వినోద్ రెడ్డిపై దాడి చేశాడు. అతడితో పాటు బేగరి రాములు, కమ్మరి రమణాచారి విచక్షణారహితంగా కొట్టడంతో చనిపోయాడు. అనంతరం నిందితులు నవీన్ ఇంటికొచ్చి డబ్బులు తీసుకొని పారిపోయారు. మృతుడి సోదరుడు విష్ణువర్ధన్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 8న సంగారెడ్డిలో నలుగురూ కలిసి ఉన్న విషయాన్ని తెలుసుకున్నారు. కొంత మంది సాక్షు లు ఇచ్చిన సమాచారం మేరకు నిందితులని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్న కుమార్ పోలీసులను అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వట్‌పల్లి(అందోల్): తాళం వేసిన ఇంట్లో దొంగ చోరీకి పాల్పడిన ఘటన అందోలు మండల పరిధిలోని ఎర్రారం గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. జోగిపేట సీఐ అనిల్‌కుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన శేషారెడ్డి ఫిబ్రవరి 7న కూతురికి ఆరోగ్యం బాగా లేదని కుటుంబంతో కలిసి ఇంద్రేశంకు వెళ్లి బంధువుల వద్ద ఉండి వారం రోజుల తర్వాత 14న రాత్రి ఎర్రారం గ్రామానికి చేరుకున్నాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా ఇంట్లోని 25 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.60 లక్షల నగదు కనిపించలేదు. ఇంట్లో దొంగలు పడ్డారని జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నేతృత్వంలో పోలీసులు విచారణ చేపట్టి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ జరిపారు. శేషారెడ్డి ఇంటి సమీపంలో ఉండే బాయికాడి శ్రీశైలం దొంగతనానికి పాల్పడినట్లుగా గుర్తించారు. అతడి వద్ద నుంచి బంగారం స్వాధీనం చేసుకోగా, నగదు బెట్టింగ్‌లు, జల్సాలకు ఖర్చయినట్లు నిందితుడు తెలిపాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. కేసు విచారణలో కానిస్టేబుళ్లు సంజీవ్, అరవింద్, నర్సింహ గౌడ్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనిల్‌కుమార్

భర్త కళ్లెదుటే భార్య మృతి

- కుమారుడికి స్వల్ప గాయాలు
- బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్త, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంకు చెందిన మింటు గిరి బతుకుదెరువు కోసం వచ్చి ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఆదివారం రాత్రి బైక్‌పై భార్య రంభాదేవి, కుమారుడు యూష్ (8) ముగ్గురూ బైక్‌పై ముత్తంగి వచ్చి తిరిగి ఇస్నాపూర్ వెళ్తున్నారు. మార్గమధ్యలో ఓల్డ్ మంజీరా బ్యాంక్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రంభా దేవి కిందపడగా టిప్పర్ మీది నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ నడుపుతున్న గిరి, అతడి కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి..

ఝరాసంగం(జహీరాబాద్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని కప్పాడ్ గ్రామానికి చెందిన పట్లోళ్ల రాచన్న(41) ఆదివారం రాత్రి భోజనం చేసి గ్రామం నుంచి సంగీతం వైపు స్నేహితులతో కలిసి నడుచుకుంటూ వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో రాయికోడ్ మండల పరిధిలోని కప్పాడ్ గ్రామానికి చెందిన అంజిరెడ్డి సింగితం వైపు నుంచి బైక్‌పై అతివేగంగా వచ్చి రాచన్నను ఢీకొట్టాడు. వెంటనే చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాచన్న కొన్నేళ్లుగా బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఘటన విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తంతో పాటు పలువురు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ట్రాక్టర్‌ను కంటైనర్ ఢీకొని యువకుడు

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన నార్సింగి జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినోద్దీన్ కథనం మేరకు.. నార్సింగి వడ్డేర కాలనీకి చెందిన బోసు అశోక్ తన సోదరుడు నర్సింహులు కుమారుడు బోస్ ప్రభాస్(18)ని ట్రాక్టర్‌పై కూర్చోపెట్టుకొని నార్సింగి వైపు వస్తున్నారు. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి యూపీకి చెందిన కంటైనర్ వేగంగా వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రభాస్ ఎగిరి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.



ప్రభాస్(ఫైల్)

కారు బోల్తా : ఇద్దరికి గాయాలు

పెద్దశంకరంపేట(మెదక్): కారు అదుపుతప్పి బోల్తా పడటంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఉత్తులూర్ వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పల్లిగడ్డ గ్రామానికి చెందిన మహేశ్ కారులో ఉత్తులూర్ గ్రామంలోని బంధువుల ఇంటికి ఆదివారం వచ్చాడు. అదే గ్రామానికి చెందిన రాజుతో కలిసి పెద్దశంకరంపేట వైపు వస్తుండగా బ్రిడ్జి వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108లో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మద్యం మత్తులో వాహనం ప్రమాదానికి గురైనట్లు సమాచారం.

బైక్, కారు ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): బైక్, కారు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు గాయాల పాలయ్యారు. స్థానికుల కథనం మేరకు.. బొత్తెల పల్లె గ్రామానికి చెందిన గుగులోతు రమేశ్ బైక్‌పై హుస్నాబాద్ నుంచి బొత్తెల పల్లెకు వెళ్తున్నాడు. అక్కన్నపేట మీదుగా హుస్నాబాద్‌కు వస్తున్న కారు, ద్విచక్రవాహనం గొల్లకుంట గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రమేశ్‌కు తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్ సాయంతో హుస్నాబాద్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

వేర్వేరు చోట్ల ఏడుగురు బలవన్మరణం

అనారోగ్య సమస్యలతో విద్యార్థి



సాయి

బెజ్జంకి(సిద్దిపేట): అనారోగ్య సమస్యలతో ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నర్సింహులపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ క్రిష్ణారెడ్డి కథనం మేరకు.. నర్సింహులపల్లె గ్రామానికి చెందిన కుసుంబ రవి పద్మలకు ఇద్దరు కుమారులు. వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. పెద్ద కుమారుడు సాయి(22) కరీంనగర్‌లోని ప్రైవేటు కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. నాలుగేళ్లుగా దగ్గు, దమ్ము, కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చూయించుకున్నా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెంది వ్యవసాయం పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న సాయిని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆకారం గ్రామంలో రైతు



లక్ష్మయ్య

దుబ్బాకరూరల్: అనారోగ్య సమస్యలతో ఉరేసుకొని రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఆకారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. దుద్దెడ లక్ష్మయ్య(52)గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆరు నెలలుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఇటీవల పెద్ద ప్రేగుకు శస్త్ర చికిత్స చేశారు. అప్పటి నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తీవ్ర ఇబ్బందులకు గురయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై తెల్లవారు జామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని వ్యక్తి..



ఇమామ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిలప్‌చెడ్ మండలం చండూర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. చండూర్ గ్రామానికి చెందిన దూదేకుల ఇమామ్ (38) హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట్‌లో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండేళ్ల కిందట కట్టిన ఇంటి నిర్మాణానికి అప్పులు కావడంతో మనస్తాపం చెందిన ఇమామ్ 15న హఫీజ్‌పేట్ నుంచి చండూర్ గ్రామానికి వచ్చాడు. 16న ఉదయం భార్య ఫాతిమాబేగం ఫోన్ చేసినా స్పందించకపోవడంతో బావ అయిన షాదుల్లాకు విషయం చెప్పింది. అతడు వెళ్లి చూసేసరికి ఇంట్లో ఇమామ్ ఉరేసుకొని కనిపించాడు. మృతుడి భార్య ఫాతిమా బేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అదనపు కట్నం వేధింపులకు వివాహిత



మహేశ్వరి

కంగ్టి(నారాయణఖేడ్): ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కంగ్టి మండలం భీంరా గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నాగన్‌పల్లి గ్రామానికి చెందిన పోగుల రవీందర్ రెడ్డి, సుజాత రెండవ కుమార్తె మహేశ్వరి(22)కి భీంరా గ్రామానికి చెందిన బోండ్ల పండరిరెడ్డితో 2022లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అత్తారింట్లో భర్త, మామ, బావ అదనపు కట్నం తేవాలని మహేశ్వరిని వేధించ సాగారు. ఈ విషయంలో గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి సముదాయించారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో సోమవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు భర్త బోండ్ల పండిరిరెడ్డి, బావ బసిరెడ్డి, మామ గంగారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

చెరువులో దూకి యువకుడు

కంది(సంగారెడ్డి): చెరువులో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కంది మండలంలోని చిమ్నాపూర్ తండా లో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై రవీందర్ కథనం మేరకు.. చిమ్నాపూర్ తండాకు చెందిన భానోత్ అంబర్ సింగ్(25) ఆదివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తండాకు సమీపంలో ఉన్న ధర్మసాగర్ చెరువుకట్టపై అంబర్ సింగ్ చెప్పులు ఉన్నట్లు తండా వాసులు గుర్తించారు. పోలీసుల సహకారంతో చెరువులో ఆచూకీ కోసం గాలించగా అంబర్ సింగ్ మృతదేహం లభించింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతులు



పురుషోత్తం

రామాయంపేట(మెదక్): ఆర్థిక సమస్యలతో మండల పరిధిలోని ప్రగతి ధర్మారంలో ఒకరు, ఆర్. వెంకటాపూర్ గ్రామంలో మరొకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్ఐ బాల్‌రాజ్ కథనం మేరకు.. ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన రైతు మాసాయిపేట పురుషోత్తం (34) కొంతకాలంగా అప్పుల బాధతో సతమతమవుతున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేసిన అనంతరం పొలానికి నీరు పెట్టి వస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బోరు వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. అప్పుల బాధతోనే భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య భాగ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మరో ఘటనలో ఆర్ వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు పుర్ర రాములు (36) ఆర్థిక సమస్యలతో రెండు రోజుల కిందట ఇంటిలోనే క్రిమి సంహారక మందు తాగాడు. అతడిని చికిత్స నిమిత్తం రామాయంపేట నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా సోమవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వారాంతపు సంత వేలం వాయిదా

రూ.కోటి దాటింది.. అంత డబ్బు చెల్లించలేమంటున్న కాంట్రాక్టర్లు

హుస్నాబాద్: వారాంతపు సంత వేలం రూ.కోటి దాటిపోయింది. అంత డబ్బు చెల్లించలేం. తగ్గిస్తేనే అంగడి నిర్వహణ చేపడుతామని పలువురు కాంట్రాక్టర్లు వేలం పాట పాడలేదు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం 2025–26 సంవత్సరానికి గాను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సంత బహిరంగ వేలం నిర్వహించారు. గతేడాది వార సంత రూ. కోటి 20 లక్షల 26 వేలకు పలికింది. ఈ సారి అదనంగా 5 శాతం కలిపి రూ.కోటి 26 లక్షల 27 వేల 300 నుంచి సర్కార్ పాటను ప్రారంభించారు. వేలం పాటలో 11 మంది పాల్గొనగా కాంట్రాక్టర్లు సిండికేట్ అయ్యి ఎవరూ పాడకుండా మిన్నకుండి పోయారు. అంగడిలో నెలకొన్న సౌకర్యాలకు ఒక్క రూపాయి ఖర్చు పెట్టడం లేదన్నారు. హుస్నాబాద్‌కు పక్కనున్న ప్రాంతాల్లో కొత్తగా అంగడీలు ఏర్పాటు చేశారన్నారు. వేలం పాటకు తగ్గట్లుగా రుసుం ఎక్కువ వసూలు చేయడంతో రైతులు, వ్యాపారులు పక్కనున్న అంగడీలకు వెళ్లడంతో ఆదాయం తగ్గి నష్టం వస్తుందని కాంట్రాక్టర్లు తెలిపారు. దీంతో వేలంను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో రీ టెండర్ నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు.

అగ్ని ప్రమాదాలు.. కష్టం బూడిద పాలు

- ఒక్క రోజే నాలుగు ఘటనలు
- భారీస్థాయిలో ఆస్తి నష్టం
- లబోదిబోమంటున్న బాధితులు

కలప మిల్లులో షార్ట్ సర్క్యూట్

జహీరాబాద్ టౌన్: ఓ కలప మిల్లులో అగ్ని ప్రమాదం జరిగిన ఘటన జహీరాబాద్ పట్టణంలోని రాచన్నపేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాచన్నపేటలో గల గురుకృష సామిల్(కలప మిల్లు)లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. తొలుత సామిల్‌కు మంటలు అంటుకొని ముందున్న మారుతీ కార్పెంట్ షాపునకు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న స్థానికులు మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్, స్థానికులు మంటలార్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వచ్చి మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో కలపతోపాటు కార్పెంట్ దుకాణంలో ఉన్న మిషన్‌లు, బైక్ దగ్ధమైంది. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. జహీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వంటగదిలో మంటలు

వెల్దుర్తి(తూప్రాన్) : అగ్ని ప్రమాదంలో వంటగది దగ్ధమైన ఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మర్కంటి రుక్కమ్మకు చెందిన వంటగది ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని కాలి బూడిదయ్యింది. ప్రమాదంలో వంట సామగ్రి, బట్టలు, ఇతర నిత్యావసర సరుకులు కాలిపోయాయి. ఘటనా స్థలాన్ని గిర్దావర్ నర్సింగ్ యాదవ్ సందర్శించి పంచనామా నిర్వహించారు.అగ్నిప్రమాదంలో సుమారు రూ.25 వేల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.



మంటలార్పుతున్న స్థానికులు



వివరాలు తెలుసుకుంటున్న నర్సింగ్‌యాదవ్

కాలిబూడిదైన గడ్డివాము

శివ్వంపేట(నర్సాపూర్) : గడ్డివాము దగ్ధమైన ఘటన మండల పరిధి ఎదుల్లాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బురెడ్డి అంజిరెడ్డి వ్యవసాయం పొలం వద్ద నిల్వ ఉంచిన ఎండు గడ్డివాముకు నిప్పంటుకుంది. సుమారు 800 గడ్డి మోపులు దగ్ధమయ్యాయి. నర్సాపూర్ నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలార్పినప్పటికీ పూర్తిగా తగులబడిపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే నిప్పు పెట్టినట్లు బాధిత రైతు అంజిరెడ్డి వాపోయారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు ఆదుకోవాలని కోరారు.

చెరకు తోట, డ్రిప్ పైపులు దగ్ధం

జహీరాబాద్ టౌన్: అగ్నిప్రమాదంలో చెరకు తోటతోపాటు డ్రిప్ పైపులు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రమైన మొగుడంపల్లి గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని భవానమ్మపల్లికి చెందిన రైతు గొల్ల రాచన్నకు మొగుడంపల్లి వద్ద 11 ఎకరాల చెరకు తోట ఉంది. పంటను ఇటీవలె కర్మాగారానికి సరఫరా చేయగా ప్రస్తుతం మొడెం తోట(రెండవ పంట) ఉంది. రోడ్డు పక్కన తోట ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు సిగరేట్ తాగి పారవేయడంతో తోటకు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో తోటతోపాటు డ్రిప్ పైపులు కాలిపోయాయి. సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.



కాలిపోయిన చెరకు తోట